
సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం । 11 । నవంబర్ । 2024



ఆద్యంతం..అమోఘం

నటరత్న నాటక పరిషత్ ఆధ్వర్యంలో గురజాడ కళాభారతి వేదికపై నిర్వహిస్తున్న సాంఘిక నాటిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంటున్నాయి. - 8లో



నాలుగు ఆలయాలు ఒకే చోట

సువర్ణముఖి నది పరీవాహక ప్రాంతంలో గల నారాయణపురం గ్రామంలో నిర్మించిన చాతుర్లింగేశ్వర దేవాలయం ఎంతో ప్రసిద్ధి గాంచినది. - 8లో

నేడు గ్రీవెన్స్ సెల్ రద్దు

పార్వతీపురం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. దూరప్రాంతాల నుంచి అర్జీదారులు వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్ రావద్దని విజ్ఞప్తి చేశారు.

న్యూస్‌రీల్

జిల్లాలో ఆరోగ్య శాఖ కమిషనర్ పర్యటన



డీఎంహెచ్‌ఓ విజయ పార్వతి

పార్వతీపురంటౌన్: జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు రాష్ట్రస్థాయి అధికారులు జిల్లా పర్యటన చేయనున్నారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయ పార్వతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ వి.కరుణ, రాష్ట్ర స్థాయి జాయింట్ డైరెక్టర్లు సోమ, మంగళ వారాల్లో జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి పరిశీలించనున్నారని తెలియజేశారు. ఈ పర్యటనలో ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, మందులు, పరికరాలు, సిబ్బంది సమర్థత వంటి అంశాలను పరిశీలించి అవసరమైన మెరుగుదలకు సంబంధించిన సూచనలు ఇస్తారని తెలియజేశారు. ఈ పర్యవేక్షణ ద్వారా జిల్లా ప్రజలకు మరింత నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నారని తెలిపారు. ఈ పర్యటన జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ పర్యవేక్షణ ద్వారా వారు గుర్తించిన సమస్యలను పరిష్కరించి, జిల్లాలో ఆరోగ్య రంగంలో మరింత సమర్థవంతమైన సేవలను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు.

వరి చేను ధ్వంసం చేసిన ఏనుగులు



వరి చేనును ధ్వంసం చేస్తున్న ఏనుగులు

భామిని: మండలంలోని తివ్వాకొండల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు ఆదివారం నల్లరాయిగూడ-తాటిమానుగూడల మధ్య పంటపొలాల్లోకి వచ్చి దిగి కొంత ధాన్యం పంటను తిని, అత్యధికంగా తొక్కిసలాటతో ధ్వంసం చేశాయి. ఖరీఫ్ వరిపంట కోత దశకు వచ్చేసరికి ఏనుగుల బెడద ఎక్కువై పంటలను నాశనం చేస్తున్నాయని ఆదివాసీ గిరిజన రైతులు వాపోతున్నారు. కోత దశలోని వరిచేనును ఏనుగుల గుంపు కాళ్లతో తొక్కి నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఆటవీ శాఖాధికారులు ఏనుగుల గుంపు బాధలు తప్పించాలని సర్పంచ్ గొయింతి ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు.

నిర్ణీత సమయానికి విమానాశ్రయ పనులు పూర్తి చేయాలి

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



భోగాపురంలో జరుగుతున్న విమానాశ్రయ పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

భోగాపురం: భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయ పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జీఎంఆర్, ఎల్ అండ్‌టీ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. భోగాపురంలో జరుగుతున్న అంతర్జాతీయ విమానాశ్రయ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఎయిర్‌పోర్టు టెర్మినల్ భవనం, రన్‌వే, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్ భవనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశా రు. పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీఎంఆర్, ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది, సీఐ ఎస్వీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో స్పెషల్ డ్రైవ్

విజయనగరం :ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ 2025లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి ఆదివారం విజయనగరంలో పరిశీలించారు. వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ నెల 9, 10 తేదీల్లో చేపట్టిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. విజయనగరంలోని కణపాక పాఠశాలలో 25, 26, 27 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. సవరణ ప్రక్రియపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించాలని, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని బీఎల్‌ఓలను డీఆర్‌ఓ ఆదేశించారు. ఈ నెల 23, 24 తేదీల్లో కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ఆయన వెంట ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సంజీవి కూడా ఉన్నారు.

ఆకలి కేకలు



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న 104 సిబ్బంది

- మూడు నెలలుగా జీతాల్లేవు
- మా గోడు పట్టించుకోండి
- హామీలు ఇచ్చి మరిచిన కూటమి ప్రభుత్వం
- ఉద్యోగ భద్రత కోరుతూ 104 ఉద్యోగుల పోరుబాట
- ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్
- కలెక్టరేట్ ఆవరణలో నిరసన దీక్షలు

పార్వతీపురంటౌన్: దీర్ఘకాలిక డిమాండ్ల పరిష్కారం కోసం వైద్యఆరోగ్యశాఖ పరిధిలోని 104 వాహనాల ఉద్యోగులు పోరుబాట పట్టనున్నారు. ఉద్యోగ భద్రత లేకపోవడం, సకాలంలో జీతాలు అందని పరిస్థితుల్లో కాంట్రాక్ట్ బేసిక్‌పై విధులు నిర్వహిస్తున్న 104 వాహనాల డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈఓ) నెలల తరబడి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యమానికి తెరతీశారు. ప్రస్తుత కూటమి పాలనలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో సమస్యలు మరింత జఠిలమయ్యాయి. జీతాలు కూడా సక్రమంగా అందని పరిస్థితి ఏర్పడింది. 104 వాహనాల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, సీనియర్ డ్రైవర్లకు ఐదేళ్లకు ఒకసారి రూ.5 వేల జీతం పెంచుతామని, ఏటా 10 శాతం ఇంక్రిమెంట్లు కలుపుతామన్న హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదు. సరిగా జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని 104 ఉద్యోగులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించారు. మూడు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనాల డ్రైవర్లు, డీఈఓలు ఉద్యోగాల నుంచి తప్పుకునే పరిస్థితి ఏర్పడడంతో ఆ ఉద్యోగుల యూనియన్ రంగంలోకి దిగి 104 వాహనాల నిర్వహణ సంస్థ, ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైంది. మారుమూల గ్రామాలకు సైతం వైద్యఆరోగ్యశాఖ సిబ్బందిని తీసుకువెళ్లే 104 వాహనాల డ్రైవర్లు, డీఈఓలు జీతాలందక పడుతున్న బాధితులను జిల్లా స్థాయి అధికారులు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని కలెక్టరేట్ ఆవరణలో నిరసన దీక్షలు చేపట్టారు.



పట్టణంలో 104 వాహనం

పెండింగ్‌లో జీతాలు

గత మూడు నెలలుగా 104 వాహనాల డ్రైవర్లు డీఈఓలకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 30 వాహనాలు ఉండగా 30 డ్రైవర్లు, 30 డిఈఓలు బఫర్లు 8 కలిపి మొత్తం 68 మంది ఉన్నారు. డ్రైవర్లకు మూడు నెలల పెండింగ్ జీతాలు రూ.25లక్షలు, డీఈఓలకు రూ.20 లక్షలు నిర్వహణ సంస్థ చెల్లించాల్సి ఉంది. తమ డిమాండ్ల పరిష్కారానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి వినతిపత్రం అందజేసినా ఫలితం లేకుండా పోయిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తమ సమస్యలపై కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తామని అప్పటికీ సమస్యకు పరిష్కారం దొరక్కపోతే రాష్ట్ర కమిటీ సూచనల మేరకు సమ్మె బాట పడతామని సిబ్బంది స్పష్టం చేశారు.

ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు:

- 104 వాహనాలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలి. తద్వారా తక్కువ ఖర్చుతో కేవలం రూ.50,000లతో ఈ సర్వీస్‌లను నిర్వహించవచ్చు.
- 104 సర్వీసులో పనిచేస్తున్న డీఎస్సీఆర్‌ఓఆర్(డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ రూల్ ఆఫ్ రిజర్వేషన్) ద్వారా నియమించి సుదీర్ఘంగా సేవలందిస్తున్న 326 మంది సీనియర్ డ్రైవర్లను ఇతర వైద్య శాఖల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించాలి. 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చెయ్యాలి.
- 2020వ సంవత్సరంలో విధుల్లో చేరిన డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగులకు భద్రత కల్పించి జీఓ నంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలి.
- 104 వాహనాల నిర్వహణ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇవ్వకుండా ఉన్న ఇంక్రిమెంట్లను ఎరియర్స్ రూపంలో ఇవ్వాలి.
- పీఎఫ్, ఈఎస్ఐని నిర్వహణ సంస్థ యాజమాన్యమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.
- 104 ఉద్యోగులకు ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించాలి.
- వాహనాల ఫిట్, ఇన్సూరెన్స్ వెంటనే చేయించాలి.

ఉద్యోగులకు భద్రత కల్పించాలి



2020వ సంవత్సరంలో విధుల్లో చేరిన డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి. జీఓ నంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలి. 104 సర్వీసులు గతంలో మాదిరిగా ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలి.

-డి. ఆనందరావు,
104 యూనియన్ జిల్లా ప్రెసిడెంట్

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



16 సంవత్సరాల నుంచి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్నాం. కరోనా కష్ట కాలంలో ఎన్నో ప్రకృతి విపత్తులలో వచ్చిన సమయంలో కూడా ఇబ్బందులు పడి ప్రజలకు మెరుగైన సేవలు అందించాం. మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి. ఉద్యోగులకు ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలి.

ఎ.స్వామి నాయుడు,
104 యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

మన్యం జిల్లాకు మొండిచేయి

- నామినేటెడ్ పదవుల్లో ఆశాభంగం



పార్వతీపురం టౌన్: నామినేటెడ్ పదవుల రెండో విడత పందేరంలో మన్యం జిల్లా నాయకులకు టీడీపీ కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపించింది. మొదటి విడత నామినేటెడ్ పోస్టుల భర్తీలో గిరిజన నాయకురాలు లావణ్యను ట్రైకార్ సంస్థ డైరెక్టర్‌గా నియమించింది. రెండో విడత నామినేటెడ్ పదవుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించగా ఈ జాబితాలో మన్యం జిల్లా నుంచి ఒక్కరికీ చోటు దక్కలేదు. మొదటి విడతలో ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు ఆర్‌పీ భంజ్‌దేవ్, గద్దె బాబూరావును సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమించగా వారిద్దరూ ఆ పదవులను స్వీకరించలేదు. రెండో విడత జాబితాలో జిల్లాలో ఉన్న బీసీ, ఎస్టీ నాయకుల్లో ఒక్కరికీ చోటు దక్కలేదు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుకు ఆశాభంగం ఎదురైంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోనూ టీడీపీకి బలమైన బీసీ, ఎస్టీ నాయకులున్నారు. సాలూరు నియోజకవర్గంలో టీడీపీ సీనియర్ నాయకులు పిన్నింటి ఈశ్వరరావు, చలుమూరి వెంకటరావు, మావుడి ప్రసాద్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే భంజేవ్ ఉన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో మాజీ ఎంపీపీ, సీనియర్ నాయకుడు గొట్టాపు వెంకటనాయుడు. కురుపాం నియోజకవర్గంలో సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, పాలకొండలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పడాల భూదేవి ఉన్నారు. మూడు ఎస్టీ నియోజకవర్గాలు, ఎస్సీ నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపు కోసం కృషి చేసిన నాయకుల్లో ఎక్కువ మంది బీసీలే ఉన్నారు. నాలుగు నియోజకవర్గాల్లోనూ ఒక్క బీసీ నాయకుడికీ నామినేటెడ్ పదవుల భర్తీలో ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో అంతా నిట్టూరుస్తున్నారు.

శంబర పోలమాంబ జాతర తేదీలు ఖరారు



చదురుగుడిలో అమ్మవారు జాతర తేదీలను ప్రకటిస్తున్న ఈఓ వీవీ సూర్యనారాయణ, గ్రామపెద్దలు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర తేదీలను దేవదాయ శాఖ అధికారులు గ్రామపెద్దల సమక్షంలో ఆదివారం ఖరారు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామంలో కొలువైన శంబర పోలమాంబ అమ్మవారి జాతర తేదీలను చదురుగుడిలో ప్రకటించారు. డిసెంబర్ 23న పెద్దమ్మవారి సనప చాటింపు వేస్తారు. 30న పెద్దమ్మవారిని గ్రామంలోకి తెచ్చేందుకు ముహూర్తం ఖరారు చేశారు. 2025 జనవరి 6వ తేది పెద్దమ్మవారి తొలేళ్ల ఉత్సవం, 7న ప్రధాన ఉత్సవం, 8న అనుపోత్సవం నిర్వహించి, అదే రోజు శంబర పోలమాంబ అమ్మవారు (చిన్నమ్మ వారు) పండగ తెచ్చేందుకు చాటింపు వేస్తారు. జనవరి13న పోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి కొని తెచ్చేందుకు నిర్ణయించారు. జనవరి 14వ తేదీన అమ్మవారు గ్రామానికి చేరుకుని, చదురుగుడిలో విశ్రాంతి తీసుకుంటారు, అప్పటినుంచి 13 రోజులపాటు పోలమాంబ అమ్మవారు గ్రామంలో తిరువీధి చేస్తూ, భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. జనవరి 27న తొలేళ్ల ఉత్సవం, 28న సిరిమానోత్సవం, 29న అనుపోత్సవం నిర్వహించేందుకు దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, రెవిన్నాయుడు, ఆశాజీల సమక్షంలో నిర్ణయించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

దీపోత్సవం



కార్తీకమాసం సందర్భంగా మండలంలోని సారిక పంచాయతీ పరిధిలో ఉన్న రామనారాయణం ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించారు. చిన్మయి మిషన్‌కు చెందిన విజయానంద సరస్వతి ముఖ్య అతిథిగా పాల్గొని దీపోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కోటి జన్మల పుణ్యఫలం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ దంపతులు, నాగరత్నం, కె.విక్రమార్క, నందివాడ వేణుగోపాల్, పీఆర్వో రమణ, తదితరులు పాల్గొన్నారు.

-విజయనగరం రూరల్

పదికాలాలు నిలిచేలా..

కోర్టు భవనాల నిర్మాణం జరగాలి

- న్యాయవాదులు కమిటీగా ఏర్పడి భవనాల నిర్మాణంపై బాధ్యత తీసుకోవాలి
- బార్ అసోసియేషన్ ఐక్యత, పట్టుదల, సంకల్పం వల్లే నూతన కోర్టు భవనాల మంజూరు
- సకాలంలో భవనాల నిర్మాణం పూర్తయ్యేలా శ్రద్ధ వహించాలి
- నిర్మాణం పూర్తయ్యాక పరిరక్షించుకోవాలి
- యువ న్యాయవాదులే భవనాల నిర్వహణ బాధ్యత తీసుకోవాలి
- కృతజ్ఞత సత్కార సభలో హైకోర్టు న్యాయమూర్తుల సూచన
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి హాజరైన న్యాయవాద సంఘాల ప్రతినిధులు
- పది మంది హైకోర్టు న్యాయమూర్తులను సత్కరించిన బార్ అసోసియేషన్లు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న న్యాయమూర్తులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

రాష్ట్రంలోని ఏ జిల్లాలోనూ లేని విధంగా విజయనగరం జిల్లా కోర్టుకు ఆధునిక వసతులతో కూడిన నూతన భవన సముదాయం మంజూరైందని, సుదీర్ఘకాలం పాటు నిలిచేలా భవన నిర్మాణం సమయంలోనే న్యాయవాదులు బాధ్యత తీసుకోవాలని పలువురు హైకోర్టు న్యాయమూర్తులు సూచించారు. ముఖ్యంగా యువ న్యాయవాదులే ఈ భవనాల్లో న్యాయవాద వృత్తిలో ప్రాక్టీస్ చేయనున్నందున వారిపైనే భవనాల నిర్మాణం, నిర్వహణ బాధ్యత అధికంగా ఉంటుందన్నారు. విజయనగరం బార్ అసోసియేషన్ చూపిన ఐక్యత, పట్టుదల, సంకల్పంతోనే నూతన భవనాల మంజూరు సాకారమయ్యిందని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తులుగా, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిలుగా తమ వంతు పాత్రను నిర్వర్తించామని, ఈ భవనాల కోసం ప్రత్యేకంగా ఏవిధమైన ప్రయత్నాలు చేయలేదని పలువురు హైకోర్టు న్యాయమూర్తులు పేర్కొన్నారు. రాష్ట్రానికి న్యాయమూర్తులను అందించడంలో విజయనగరం ముందంజలో ఉందన్నారు. విజయనగరం జిల్లా కోర్టు నూతన భవన సముదాయం నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో ఈ జిల్లాకు గతంలో అడ్మినిస్ట్రేటివ్ జడ్జిలుగా పనిచేసిన పలువురు న్యాయమూర్తులకు, జిల్లా వాసులైన హైకోర్టు న్యాయమూర్తులకు జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కతజ్ఞత పూర్వక అభినందన సభ ఆదివారం నగరంలోని రింగురోడ్డులో గల ఒక ఫంక్షన్ హాలులో నిర్వహించారు. జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దోనాడి రమేష్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ కె.సురేష్‌రెడ్డి తదితరులను శాలువ, మొమెంటోతో విజయనగరం, విశాఖ, పార్వతీపురం జిల్లాల బార్ అసోసియేషన్ల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ వదిలివేయబడిన చెరువులో తేలికపాటి మట్టితో కూడిన నేలపై నిర్మించిన కారణంగానే గతంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన కోర్టు భవనాలు దెబ్బతిన్నాయని చెప్పారు. జిల్లా బార్ అసోసియేషన్ దృఢ సంకల్పం వల్లే ఈ ప్రాజెక్టు ఇంత త్వరగా కార్యరూపం దాల్చిందన్నారు. బార్ సభ్యుల కృషికి తనతోటి హైకోర్టు న్యాయమూర్తుల సహకారం లభించడంతో పాటు, జిల్లా వాసిగా సొంత జిల్లాకు న్యాయవ్యవస్థ పరిధిలో ఏదైనా చేయాలనే తన తపన తోడై భవనాల మంజూరు త్వరగా సాకారమైందన్నారు. ప్రస్తుత అవసరాలకు తగినట్టుగా న్యాయవ్యవస్థకు మౌళిక వసతులు కల్పించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే నిర్ణయించిందని దెబ్బతిన్న పాత కోర్టు భవనాల స్థానంలో ఆధునిక వసతులతో కొత్తవి మంజూరు చేసేందుకు ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొన్నారు.

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి మాట్లాడుతూ భవన నిర్మాణం నాణ్యతగా జరిగేలా యువ న్యాయవాదులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. తన తండ్రి, తాతలకు విజయనగరంతో సంబంధం వుందని, తాను ఈ మట్టి నుంచి వచ్చినవాడినని పేర్కొన్నారు. చీమలపాటి రవితో పాటు ఆయన తండ్రి, సీనియర్ న్యాయవాది శ్రీరామమూర్తిని కూడా కలసి సత్కరించారు.
- యువ న్యాయవాదులకు నూతన కోర్టు భవనం ఒక దేవాలయం, విద్యాలయం వంటిదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య అన్నారు. యువ న్యాయవాదులంతా తమ వృత్తిలో బాగా రాణించాలని ఆకాంక్షించారు. సీనియర్ సభ్యుల విజయగాధలు తెలుసుకొంటూ విజయపథంలోకి వెళ్లాలన్నారు. రాష్ట్రానికి న్యాయాధికారులను అందించడంలో ఈ జిల్లా ముందు వరసలో వుందని పేర్కొన్నారు. న్యాయవాదులు సమిష్టిగా బాధ్యత తీసుకొని భవనం నిర్వహణపై శ్రద్ధ తీసుకుంటే భవనం జీవితకాలం పెరుగుతుందన్నారు.
- కొన్ని వందల కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న మీ భవనాన్ని పరిరక్షించుకొనే బాధ్యత న్యాయవాదులపైనే వుంటుందని జస్టిస్ కె.మన్మథరావు చెప్పారు. జిల్లా కోర్టుకు చెందిన సీనియర్ న్యాయవాది, సాహిత్యవేత్త ఎస్.ఎస్.ఎస్.ఎస్.రాజు తాను రచించిన దేవునితో కాసేపు పుస్తకాన్ని చదివానని పేర్కొంటూ అదో గొప్ప పుస్తకంగా అభివర్ణించారు. ఈ పుస్తకంలో పేర్కొన్న అంశాలను ప్రస్తావిస్తూ ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ, మాతృదేవోభవతో పాటు ప్రకృతి దేవోభవ అనేది కూడా చేర్చుకోవాలన్నారు.
- జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్‌రావు మాట్లాడుతూ కోర్టు భవనాల నిర్మాణం త్వరగా పూర్తయ్యేందుకు తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు.
- న్యాయమూర్తులను గౌరవించడంలో, న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడటంలో ఈ జిల్లా ఎప్పుడూ ముందంజలోనే నిలుస్తోందని జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. మర్యాదలు, మన్ననలు, చక్కటి సంబంధ బాంధవ్యాలు నిర్వహించడంలో ఈ జిల్లా వాసుల ప్రత్యేకత అని చెప్పారు.
- బార్ అసోసియేషన్‌లో ఉన్న ఐక్యత, పట్టుదల, సంకల్పంతోనే కొత్త భవనాల మంజూరు సాధ్యమైందని జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ అన్నారు. ప్రస్తుతం జిల్లా కోర్టు నిర్వహిస్తున్న భవనాలను కోర్టు అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చిన ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. వ్యవస్థల పట్ల వారికి గల గౌరవానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.
- జిల్లా కోర్టు నూతన భవనాల నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం తరపున తమ వంతు సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్, జిల్లా ఎస్పి వకుల్ జిందల్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపు

- జిల్లా నుంచి ఐదుగురి ఎంపిక
- నేడు విజయవాడలో అవార్డుల ప్రదానం

పార్వతీపురం టౌన్: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లా నుంచి విద్యాశాఖ ఐదుగురిని ఎంపిక చేసింది. సోమవారం జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ఎంపికైన ఉపాధ్యాయులకు విజయవాడలో ముఖ్యమంత్రి అవార్డులు అందజేయనున్నారు. అవార్డులు అందుకోనున్న వారి భావాలు వారి మాటల్లోనే..

మరింత బాధ్యత పెరిగింది



రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డుకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ అవార్డుతో నా బాధ్యత మరింత పెరిగింది. 40 ఏళ్లకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నా. ఉమ్మడి విజయనగరం జిల్లాలో రేగిడి మండలం, పాలకొండ, ఎల్ఎల్‌పురం, వెలగవాడ, ఏలాంలో పనిచేశారు. ప్రస్తుతం హడ్కోకాలనీలో విధులు నిర్వర్తిస్తున్నా. నిరంతరం విద్యార్థుల విద్యా ప్రగతికి కృషి చేస్తుంటాను. తోటి ఉపాధ్యాయుల సహాయ సహకారాలతోనే అది సాధ్యమైంది. -జి.జయమణి, సోషల్ అసిస్టెంట్, హడ్కోకాలనీ, పాలకొండ

బోధనభ్యసన మెరుగ్గా నిర్వహిస్తా



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం ఆనందంగా ఉంది. ఇప్పుడు మరింత బాధ్యతగా పనిచేస్తా. బోధన భ్యసన కార్యక్రమాలను మెరుగ్గా నిర్వహిస్తాను. 1998లో గజపతినగరం మండలం సాలిపేటలో తొలిసారిగా ఉద్యోగంలో చేరాను. మరుపల్లి, డోలపాలెం, నెల్లిమర్ల మండలం టెక్కలిలో విధులను నిర్వహించాను. 2022లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నాను. ప్రస్తుతం పాచిపెంట మండలంలోని నూరువరహాలుపాడులో పనిచేస్తున్నాను.

-పొట్నూరు ఈశ్వరరావు, ఉపాధ్యాయుడు
నూరువరహాలపాడు పాఠశాల,
పాచిపెంట మండలం


అందరి సహకారంతోనే..



తోటి ఉపాధ్యాయుల సహకారంతో విద్యా ప్రమాణాల మెరుగుకు ఎంతగానో కృషి చేశాం. విద్యార్థుల్లో భోధనా సామర్థ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నాను. మా కేజీబీవీలో విద్యార్థులు అన్ని రంగాల్లో ముందువరుసలో ఉంటున్నారు. ఒక ప్రిన్సిపాల్‌గా విద్యార్థుల అభివృద్ధి చూసి గర్వపడుతున్నాను. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకోనుండడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం గుమ్మలక్ష్మీపురం మండలంలో కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నాను.

- శ్రీ రంజని, ప్రిన్సిపాల్, కేజీబీవీ, గుమ్మలక్ష్మీపురం

32 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో..



రాష్ట్రప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. 32 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నాను. ఎన్నో అవార్డులను అందుకున్నాను. అయితే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడంతో మరింత బాధ్యత పెరిగింది.

- డి.లక్ష్మణరావు, ప్రిన్సిపాల్,
గిరిజన సంక్షేమ గురుకుల బాలుర ఆశ్రమ పాఠశాల, కొమరాడ

గర్వంగా ఉంది



రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపికైనందుకు గర్వంగా ఉంది. గతంలో ఎన్ని అవార్డులు తీసుకున్నా రాష్ట్రస్థాయి అవార్డు సాధించడం మరచిపోలేని అనుభూతి. నేను విధులు నిర్వహిస్తున్న పాఠశాలల్లో సన్మానాలు, బొబ్బిలివీణ, సరస్వతి జ్ఞాపికలు తీసుకోవడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా.

-గొంగాడ రామారావు, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, ఎ.వెంకంపేట, జెడ్పీహెచ్‌ఎస్, మక్కువ మండలం

క్లుప్తంగా

ఆద్యంతం..అమోఘం

● ఆలోచింపజేసిన సాంఘిక నాటిక ప్రదర్శనలు



విముక్తి నాటికలో సన్నివేశం

విజయనగరం టౌన్: నటరత్న నాటక పరిషత్ ఆధ్వర్యంలో గురజాడ కళాభారతి వేదికపై నిర్వహిస్తున్న సాంఘిక నాటిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంటున్నాయి. రెండోరోజు ఆదివారం సాయంత్రం చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వంలో ప్రదర్శించిన విముక్తి నాటిక ఆలోచింపజేసింది. సమాజాన్ని ముందుండి నడిపించాల్సిన యువత నేడు గంజాయి, హెరాయిన్ వంటి మత్తుపదార్థాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. దేశభవిష్యత్తు ప్రశ్నార్థకంగా మార్చారు. మత్తుపదార్థాల నుంచి యువతకు విముక్తి కల్పించి, దేశాన్ని రక్షించుకుందామనే సందేశంతో ముగిసిన నాటిక ఆద్యంతం తల్లిదండ్రులను ఆలోచింపజేసింది. అనంతరం గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి మూల్యం సాంఘిక నాటిక రక్తికట్టించింది. ఆడపిల్లలపై అడుగడుగునా రకరకాల ఆంక్షలతో పాటు పైశాచికత్వానికి దిగుతున్నారు. అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళపై ఆకృత్యాలకు పాల్పడుతున్నారు. అటువంటివాటికి వ్యతిరేకంగా ఒక వివాహిత తన హక్కును నిరూపించుకుని మరీ సాధించిన అపూర్వ ఘటనను నాటికలో చక్కగా చూపించారు. అభినయ సంస్థ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్, అధిక సంఖ్యలో కళాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

కీళ్ల నొప్పులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి సత్యం (59) పురుగు మందుతాగి శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు సత్యం కొద్దికాలంగా కీళ్లనొప్పులతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మాక స్థితికి చేరుకున్నాడు. పొలంపనులు ముగించుకుని ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు కింద పడి ఉన్న సత్యాన్ని గుర్తించి హుటాహుటిన ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ పడాల్ తెలిపారు. మృతుడికి భార్య రాము, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



గుర్తు తెలియని మహిళ మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న రిజర్వేషన్ కౌంటర్ ఫుట్‌పాత్ వద్ద సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని మహిళ మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె గురించి విచారణ చేయగా యాచకవృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిసిందన్నారు. మృతురాలి బంధువులెవరైనా ఉంటే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

మూడు కంటైనర్ల సీజ్



పెదమానాపురం పోలీస్‌స్టేషన్ వద్ద సీజ్ చేసిన పశువులను తరలిస్తున్న వాహనాలు

దత్తిరాజేరు: అక్రమంగా పశువులు తరలిస్తున్న మూడు కంటైనర్లను సీజ్ చేసినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి ఆదివారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం పార్వతీపురం నుంచి తూర్పుగోదావరి జిల్లా కత్తిపూడికి పశువులను కంటైనర్లలో తరలిస్తుండగా పెదమానాపురం వద్ద శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ అధికారులు కంటైనర్లను, వాటిలో ఉన్న 96 పశువులను పట్టుకుని స్టేషన్‌కు అప్పగించడంతో పశువుల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఫుట్‌బాల్ పోటీల్లో నాలుగో స్థానం

సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి అండర్–19 ఫుట్‌బాల్ క్రీడాపోటీల్లో బాలుర విభాగంలో విజయనగరం జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు, ప్రగతి జూనియర్ కళాశాల సత్తెనపల్లి ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర స్థాయి అండర్–19 ఫుట్‌బాల్ పోటీలు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించారు. ఆదివారం ఫైనల్స్ జరిగిన అనంతరం విజయనగరం జట్టుకు బహుమతి ప్రదానం చేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

జీడి మామిడికి బీమా ధీమా

● పీఎం ఫసల్ యోజన ద్వారా లబ్ధి
● ఏజెన్సీలో అధిక శాతం జీడిమామిడి సాగు



పొలం పిలుస్తుంది కార్యక్రమంలో జీడిమామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్/సీతంపేట: తోటలు సాగుచేయడం ఒడిదొడుకులతో కూడిన విషయం. వాతావరణం అనుకూలించకున్నా, చీడపీడలు, తెగుళ్ల దాడి చేసినా, వరదలు, అనుకోని విపత్తులు తలెత్తినా నష్టపోయేది ఆరుగాలం కష్టించిన రైతు. పార్వతీపురం మన్యం జిల్లాలో అధికశాతం ఏజెన్సీ కలబోసి ఉండడంతో రైతులు జీడిమామిడి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ సాగు పూర్తిగా వాతావరణ ఆధారం. దీంతో కేంద్రప్రభుత్వం వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని రైతుల కోసం అందుబాటులోకి తెచ్చింది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను ప్రారంభించిన 2016లోనే ఉద్యాన శాఖ ద్వారా జీడిమామిడి పంట రైతులకు బీమా వర్తింపజేసింది. అయితే గడిచిన ఎనిమిదేళ్లుగా ఈ పథకం ఈ పంటలకు వర్తించలేదు. తాజాగా 2024–25 సంవత్సరం నుంచి జీడి మామిడి పంటకూ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకృతి వైపరీత్యాలతో తోటలు, దిగుబడి నష్టపోయిన రైతులను ఆదుకోవాలనే ఆలోచనతో ఉద్యాన శాఖ సూచనలతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. దీని కోసం రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ జీడిమామిడి తోటలకు ఈ నెల 15లోగా బీమా చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రబీలో జీడిమామిడి పంటకు వాతావరణ గణన ఏపీఎస్‌డీపీఎస్ ఇచ్చిన నివేదిక ఆధారంగా దీనిని బీమా అమలు చేయనున్నారు. ఇఫ్కో బీమా సంస్థకు జిల్లా బాధ్యతను అప్పగించారు.

రూ. 1,600 ప్రీమియం

ఎకరాకు రూ.1,600 ప్రీమియాన్ని రైతు చెల్లిస్తే బీమా వర్తిస్తుంది. ఒక రైతు ఎన్ని ఎకరాలకైనా బీమా చేయించుకోవచ్చు. ఈకేవైసీలో నమోదు చేసుకున్న విస్తీర్ణానికి బీమా చేయవచ్చు. ఈ నెల 15 వరకూ ప్రీమియం చెల్లించడానికి గడువు ఉంది. ఇప్పటికే బ్యాంకుల్లో రుణం పొందిన, రుణం తీసుకోని రైతులూ అర్హులే. బీమా పథకం వివరాల కోసం రైతు సేవా కేంద్రాల వద్ద ఉద్యానవన శాఖ అధికారులను లేదా గ్రామ స్థాయిలో వీఏఏ, వీహెచ్ఏలను కూడా సంప్రదించవచ్చు. బీమా చేయించుకునే రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలి. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఉద్యాన శాఖ అధికారులు జీడిమామిడికి పంట బీమా పథకం గురించి అవగాహన కల్పిస్తున్నారు. మండలం యూనిట్‌గా బీమా వర్తిస్తుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులు ప్రీమియం చెల్లించే సమయంలో పట్టాదారు పాస్‌పుస్తకం లేక 1బీ పత్రం, ఆధార్ నకలు, బ్యాంకు ఖాతా పుస్తకం మొదటి పేజీ నకలు, పంట ధ్రువీ కరణ పత్రం అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఏజెన్సీ కలబోసి ఉన్న జిల్లాలో దాదాపు 61వేల ఎకరాల్లో 25,252 మంది రైతులు జీడిమామడి తోటలు సాగు చేస్తున్నారు. ముఖ్యంగా సీతంపేట, కురుపాం, గుమలక్ష్మీపురం ప్రాంతాల్లో 40వేల ఎకరాల మేర తోటలను గిరిజన, సాధారణ రైతులు సాగు చేస్తున్నారు. వారికి ఈ బీమా పథకం ఎంతో ప్రయోజకరం. ఈ నెల 15లోగా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. జిల్లాకు సంబంధించి ఇఫ్కో కంపెనీ ద్వారా ప్రీమియం చెల్లించాలి. అనుకోని విపత్తు ఎదురై పంట నష్టపోతే పరిహారం నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. మరింత సమాచారం కోసం ఫోన్ 9550044894, 8330928627 నంబర్లను సంప్రదించవచ్చు.

తమ్మినేని అమరేశ్వరి,
ఉద్యానవన శాఖాధికారిణి, పాలకొండ

ఈ సందర్భాల్లో బీమా వర్తింపు

సాగులో వర్షపాతం తక్కువ, ఎక్కువ, అనుకోని వర్షం, వాన పడిన రోజులు, కురవని రోజులను లెక్కగట్టి ప్రతికూల వాతావరణాన్ని నిర్ధారిస్తారు. అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ మించి 3–10 రోజులు (నవంబర్ 1 నుంచి ఫిబ్రవరి 28 వరకూ) ఉంటే పరిగణనలోకి తీసుకుంటారు. గాలిలో తేమశాతం, వేగం తదితర పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు..

సబ్ జూనియర్ తైక్వాండో పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



సబ్‌జూనియర్స్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న జిల్లాక్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాల, బాలికల తైక్వాండో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం పూర్తయ్యాయి. విజయనగరంలోని విజ్జి స్టేడియంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 38వ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా నుంచి సుమారు 150 మంది సబ్ జూనియర్ తైక్వాండో క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 15, 16, 17 తేదీలలో ఒంగోలు జిల్లాలో జరిగే 38వ రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి డీవీ చారిప్రసాద్, సభ్యులు వెంకటేష్, కె.శ్రీనివాస్, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండవరోజు ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగిన వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు

భోగాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా విద్యా శాఖ అధ్వర్యంలో జరుగుతున్న 68వ రాష్ట్రస్థాయి బాల, బాలికల అండర్–14 వాలీబాల్ పోటీలు రెండోరోజూ ఉత్సాహంగా కొనసాగాయి. ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు పదమూడు జిల్లాల నుంచి వచ్చిన బాలురు, బాలికలు మొత్తం 26 జట్లకు గాను ఇప్పటివరకు 30 లీగ్ మ్యాచ్‌లు, 16 క్వార్టర్ ఫైనల్, 4 సెమీఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించినట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కేవీవీఎస్ రాజు(చిన్నారి), సింగిడి నాగన్న తెలిపారు. సోమవారం ఫైనల్ మ్యాచ్ ముగిసిన అనంతరం 15 మంది బాలురు, 15 మంది బాలికలను రాష్ట్రం తరఫున ఎంపిక చేసి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు పంపించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్



మాట్లాడుతున్న విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారు చోరీ చేసిన బంగారు చైన్ రికవరీ చేసినట్లు విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. పాల్‌నగర్‌కు చెందిన కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఈ నెల 7న విశాఖ వెళ్లి, ఆర్టీసీ బస్సులో రాత్రి 10.30 గంటల సమయంలో విజయనగరంలో దిగి, లీలామహల్ సందు నుంచి రైల్వేస్టేషన్ వద్దనున్న సైకిల్ స్టాండ్‌లో ఉన్న మోటార్‌సైకిల్ తీసుకురావడానికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఆ సమయంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీమీద వెనుక నుంచి వచ్చి లక్ష్మణరెడ్డిని కింద పడేసి, మెడలోని తులం బంగారం చైన్ తీసుకుని, పారిపోయినట్లు వన్‌టౌన్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదుచేశాడు, ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు పట్టణానికి చెందిన మహంతి వినోద్ కుమార్ అలియాస్ వినోద్, పొట్నూరు డేవిడ్‌రాజు, అలియాస్ డేవిడ్‌లను కంటోన్మెంట్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం అరెస్టు చేసి, వారినుంచి తులం బంగారు చైన్, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడ్ని త్వరలో అరెస్టు చేస్తామని, గాలింపు చర్యలు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా పనిచేసిన వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ ఎల్. అప్పలనాయుడు, ఎస్సై సురేంద్రనాయుడు, హెచ్‌సీ ఎం.అచ్చిరాజు, శ్రీనులను డీఎస్పీ అభినందించారు.

తల్లిచెంతకు చేరిన పసికందు



పసికందును తల్లికి అప్పగిస్తున్న డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు (పక్కన ముసుగులో నిందితురాలు)

విజయనగరం క్రైమ్: పట్టణంలో కిడ్నాప్ అయిన 8 నెలల పసికందు ఆచూకీ కనిపెట్టి, గంటల వ్యవధిలోనే కేసుమిస్టరీని వన్‌టౌన్ పోలీసులు ఛేదించి, పసికందును కన్నతల్లిచెంతకు చేర్చారు. ఈ మేరకు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోని రాయగడకు చెందిన ఆశా సాహు, భర్త, కుమారుడితో కూలి పని నిమిత్తం విజయనగరం వచ్చి, ఎత్తుబ్రిడ్జి సమీపంలో ఉంటున్నారు. ఈ నెల 8న మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల సమయంలో ఆమె నిద్రపోతున్న సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి, తన పక్కనున్న 8నెలల పసికందు అభిన సాహూను కిడ్నాప్ చేసి తీసుకుపోయినట్లు విశ్వకాంచన అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నవంబర్ 9న బాధితురాలు ఆశా సాహు ఫిర్యాదుచేసింది. ఈ ఫిర్యాదుపై వన్‌టౌన్ ఎస్సై ఎ.నరేష్ కేసునమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు. కేసును తీవ్రమైన చర్యగా భావించిన కిడ్నాప్ కేసును ఛేదించేందుకు ఎస్పీ ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, నిందితుల కోసం గాలింపు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఈ కేసులో సాంకేతికను వినియోగించి, పసికందును ఒక మహిళ కిడ్నాప్ చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నిందితురాలి ఆచూకీ కనిపెట్టేందుకు విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ ఎల్.అప్పలనాయుడుల ఆధ్వర్యంలో పోలీసు బృందాలు ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, పట్టణంలోని ప్రధానకూడళ్లు, శివారు ప్రాంతాల్లో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. చివరకు మూడు గంటల వ్యవధిలోనే పసికందును కిడ్నాప్ చేసిన నిందితురాలిని దాసన్నపేట నాగాళపు వీధికి చెందిన కోరాడ సుశీలగా గుర్తించి, అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి పసిబిడ్డను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాలుడ్ని విజయనగరం డీఎస్పీ సమక్షంలో బాధిత తల్లికి ఆదివారం అప్పగించారు. నిందితురాలైన కోరాడ సుశీలను రిమాండ్‌కు తరలించారు. కేసులో క్రియాశీలకపాత్ర పోషించిన వారిని ఎస్పీ అభినందించారు.

మాస్ ఫిలిమ్‌తో ముందుకు వస్తున్నా..

● ప్రముఖ సినీ నటుడు వరుణ్ తేజ్



మాట్లాడుతున్న హీరో వరుణ్ తేజ్

విజయనగరం టౌన్: మాస్ ఫిలిమ్‌తో ముందుకు వస్తున్నాను. ప్రేక్షకులు ఆశీర్వదించాలి. అభిమానించి సినిమాను సక్సెస్ చేయాలని ప్రముఖ సినీనటుడు వరుణ్ తేజ్ కోరారు. స్థానిక ఆదిత్య థియేటర్‌లో ఆదివారం ఉదయం ఆయన సందడి చేశారు. ముందుగా ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సినిమా థియేటర్‌కు వచ్చిన ఆయన అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా మాస్ తరహాలో మట్కా సినిమాలో నటించాను. పోస్టర్ రిలీజ్ చేయడానికి విద్యల నగరమైన విజయనగరం రావడం నా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అనంతరం థియేటర్‌లో ప్రేక్షకులతో మాట్లాడుతూ తన సినిమాను అందరూ చూసి, ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ వర్మ, అభిమాన సంఘం నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో జిల్లాకు పతకాలు



స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన 36వ ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్–24లో భాగంగా ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు కాకినాడలో జరిగిన పోటీల్లో విజయనగరం క్రీడాకారులు 5 బంగారు, 7 సిల్వర్, 8 కాంస్య పతకాలతో మొత్తం 20 పతకాలు రాష్ట్రస్థాయిలో సాధించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీఎస్ సీతారామ రాజు (చంటి రాజు) తెలియజేశారు. పతకాలు సాధించిన వారిలో ఎస్.రాహుల్ సిద్ధార్థ, ఆర్.భార్గవ్ సాయి, ఎల్. జే.దేవాన్ష్, ఎస్.ప్రదీప్, పి.హాసినిలు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆయన తెలియజేశారు. పతకాలు సాదించిన స్కేటర్లను, కోచ్‌లు బద్రీనారాయణ మురళీకృష్ణ, శ్యామ్‌లను అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీఎస్ సీతారామ రాజు,రాష్ట్ర అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఏఆర్‌వీఎన్ఎస్ మూర్తి ,అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మి, మోహన్ రావులు అభినందించారు.

పార్కులో పర్యాటకుల సందడి



ఫైవ్ డి థియేటర్‌లో మూవీ చూస్తున్న పర్యాటకులు



జలవిహార్‌లో బోటుషికారు

సీతంపేట: కార్తీక మాసం కావడంతో స్థానిక అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. జలవిహార్‌లో బోటుషికారు, ఫైవ్‌డీ థియేటర్‌లో అడ్వెంచర్ మూవీస్ చూసి ఆనందించారు. జెయింట్ వీల్, షూటింగ్, క్లైంబింగ్‌వాల్, హ్యాంగింగ్ బ్రిడ్జి వంటివి ఎక్కి సరదాగా గడిపారు.

కిరాణా షాపు దగ్ధం



విద్యుత్ షాక్ గురైన ధర్మ



కిరాణా షాపులో చెలరేగిన మంటలు

గరుగుబిల్లి: మండలంలోని పెదగుడబ గ్రామానికి చెందిన పత్తిగోల రమేష్ కిరాణా షాపు ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఆ దుకాణానికి సరఫరా అయ్యే విద్యుత్ లైను షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు పేర్కొన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పార్వతీపురం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేసి ఆస్తినష్టాన్ని కొంతమేర తగ్గించారు. ఈ ఘటనలో విద్యుత్ సరఫరాను నియంత్రించేందుకు గ్రామానికి చెందిన ధర్మ అనే యువకుడు ప్రయత్నించి విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. దీంతో చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి అవసరమైన వైద్యసేవలను అందిస్తున్నారు. ప్రమాదంలో రూ.లక్షల్లో ఆస్తినష్టం సంభవించడంతో రమేష్‌తో పాటు కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకుని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై వివరాలను సేకరించారు.

యువకుడిపై దాడి



సతీష్‌కుమార్

గంట్యాడ: మండలంలోని రావివలస జంక్షన్‌లో పాన్ షాప్ వద్ద జరిగిన వివాదంలో పెదవేమలి గ్రామానికి చెందిన ఎస్. సతీష్‌కుమార్‌పై లక్కిడాం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా కొట్టారు. దీంతో గాయపడిన సతీష్‌కుమార్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఔట్ పోస్టు పోలీసులు బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు.

నాలుగు ఆలయాలు ఒకే చోట

● అపురూప శిల్ప సంపదలు
● రాతి కట్టడం ప్రత్యేకతలు



చాతుర్లింగేశ్వర ఆలయం,(ఇన్‌సెట్లో) ఆలయంలో శివలింగం

బలిజిపేట: సువర్ణముఖి నది పరీవాహక ప్రాంతంలో గల నారాయణపురం గ్రామంలో నిర్మించిన చాతుర్లింగేశ్వర దేవాలయం ఎంతో ప్రసిద్ధి గాంచినది. 11వ శతాబ్దంలో అపురూప శిల్ప సంపద, రాతికట్టడాలతో నిర్మించి, శ్రీనీలకంఠేశ్వర, సంగమేశ్వర, మల్లికార్జున, శ్రీ నీలేశ్వర ఆలయాలు ఒకేచోట నిర్మించి ఉండడం ఇక్కడి ప్రత్యేకత. దూర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి శివార్చన చేస్తూ తరిస్తున్నారు.

నారాయణపురం కోవెలకు ఎలా వెళ్లాలంటే..

విశాఖ, విజయనగరం, పార్వతీపురం నుంచి వచ్చేవారు బొబ్బిలి చేరుకుని అక్కడినుంచి నేరుగా నారాయణపురం బస్సు ఎక్కితే చేరుకోవచ్చు. ఒక వేళ బలిజిపేట బస్సు ఎక్కితే బలిజిపేటలో దిగి అక్కడి నుంచి ఆటో, ఇతర వాహనాలపైన అయినా 5కిలో మీటర్ల దూరంలో ఉన్న నారాయణపురం చేరుకోవచ్చు. శ్రీకాకుళం నుంచి వచ్చేవారు రాజాం మీదుగా పణుకువలస జంక్షన్ నుంచి తిరిగి వంతరాం, బలిజిపేట మీదుగా నారాయణపురం చేరుకోవచ్చు. రాజాం నుంచి బస్సులో వచ్చేవారు బలిజిపేటలో దిగి నారాయణపురం చేరుకోవచ్చు.

సోషల్ మీడియాలో వేధింపులు ఆపండి

● బిడ్డ మృతి చెందడం మా దురదృష్టం
● ఆస్పత్రిలో తల్లికి తెలిస్తే ప్రమాదం



మాట్లాడుతున్న గౌరునాయుడు, కుటుంబ సభ్యులు

చీపురుపల్లి: ఓ వైపు బిడ్డ చనిపోయి మరోవైపు నా భార్య ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతుండగా కష్టాల్లో ఉన్న తమపై సోషల్ మీడియాలో అపోహలు సృష్టిస్తూ వస్తున్న వేధింపులను ఇకనైనా ఆపాలని గరివిడి మండలంలోని కాపుశంభాం గ్రామానికి చెందిన ఏనూతల గౌరునాయుడు కోరారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం పట్టణంలోని బాబూజీ ఆస్పత్రి వద్ద గౌరునాయుడు, మృతి చెందిన బిడ్డ అమ్మమ్మ శ్రీదేవి, అన్నయ్య హరీష్‌లతో బాటు గవిడి సురేష్‌లు విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన మౌనికకు నెలలు నిండడంతో ఈ నెల 8న బాబూజీ ఆస్పత్రిలో ప్రసవం కోసం చేర్పించామన్నారు. సాధారణ ప్రసవం కోసం చూసిన వైద్యులు సాయంత్రం 6 గంటలకు సమయంలో సిజేరియన్ చేయాలని చెప్పడంతో తమ అంగీకారంతోనే సిజేరియన్ చేసినట్లు తెలిపారు. సిజేరియన్ ద్వారా ప్రసవించిన మగ బిడ్డ ఆరోగ్య పరిస్థితి బాగాలేక మృతి చెందాడని దీంతో తల్లడిల్లిపోయిన తామంతా ఆస్పత్రిలో యాజమాన్యంతో వాగ్వాదానికి దిగిన సంగతి వాస్తవమేనన్నారు. తరువాత తమ వైపు పెద్దలు గవిడి సురేష్, మహంతి సూర్యారావు, కోరాడ శ్రీను తదితరులు వైద్యులతో మాట్లాడగా బిడ్డ మృతికి కారణమైన వివరాలు వైద్యులు వివరించారని దీంతో తమను ఓదార్చారని చెప్పారు. తమకు అదృష్టం లేక బిడ్డను కోల్పోయామన్నారు. అయితే వైద్యులు బాధ్యతగా బిడ్డ తల్లి మౌనికను పూర్తి స్థాయిలో చికిత్స అందించి ఇంటికి పంపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆస్పత్రి యాజమాన్యంతో తాము కుమ్మక్కైనట్లు రెండు రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న అపోహలు ద్వారా తాము తీవ్ర ఆవేదనకు లోనవుతున్నట్లు చెప్పారు. బిడ్డ మృతి చెందిన విషయం తల్లి మౌనికకు ఇంతవరకు తెలియదని అత్యవసర చికిత్స పొందుతున్న ఆమెకు ఈ విషయం తమకు తెలిస్తే దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కష్టాల్లో ఉన్న తమపై ఎలాంటి అపోహలు సృష్టించొద్దని విజ్ఞప్తి చేశారు.

బొలెరో బోల్తా పడి యువకుడి మృతి

● 19 మందికి గాయాలు
● అంతా గనిశెట్టిపాలెం వాసులే..



బోల్తా పడిన బొలెరో వాహనం



ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శృంగవరపుకోట/కొత్తవలస: దైవదర్శనం కోసం వెళ్లి తిరుగుప్రయాణంలో వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా 19మంది గాయాలపాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.కోటకు పొరుగున అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో అనంతగిరి మండలంలో ఎస్.ఆర్.పురం సమీపాన కొండపై కొలువున్న అనంత వెంకటేశ్వరస్వామి ఆలయ దర్శనం కోసం కొత్తవలస మండలం, గనిశెట్టిపాలెం గ్రామానికి చెందిన సుమారు 70మంది మూడు బొలెరో వాహనాల్లో బయల్దేరారు. వారంతా స్వామిని దర్శించి మధ్యాహ్నం కొండపై నుంచి కిందికి వస్తుండగా, ఒక బొలెరో వాహనం బ్రేక్ ఫెయిల్ అయి అదుపు తప్పి, తలకిందులుగా బోల్తా కొట్టింది, దీంతో వాహనంలో ఉన్న 20 మంది గాయాల పాలయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహనంలో వారిని ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే క్షతగాత్రుల్లో సూరెడ్డి కిరణ్‌కుమార్(22) మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన వారిలో 13 మంది తీవ్ర గాయాల పాలవడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మరో ఆరుగురు ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, గనిశెట్టిపాలెం గ్రామ సర్పంచ్ జామి ఈశ్వరరావులు దగ్గరుండి క్షతగాత్రులను మెరుగైన చికిత్సకు తరలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు.